# డబ్బు, బంగారం కోసం అమ్మమ్మను హత్య చేసిన మనవడు






## - రామాయంపేటలో దారుణం

**రామాయంపేట, జూన్ 23, 2026 (మహాప్రభ):** ద్విచక్ర వాహనం కొనుక్కోవడానికి డబ్బు ఇవ్వలేదని కన్న అమ్మమ్మనే దారుణంగా హత్య చేసిన మనవడి ఉదంతం రామాయంపేటలో కలకలం రేపింది.

**అనుమానాస్పద మృతి:** ఈ నెల 18వ తేదీన రామాయంపేట పట్టణంలోని 10వ వార్డు నివాసి దోమకొండ శైలమ్మ (65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గుండెపోటుగా భావించిన బంధువులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

**మూడో రోజు బయటపడ్డ నిజం:** మూడో రోజు కర్మకాండ తర్వాత మెడలో బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బంధువులకు అనుమానం వచ్చింది. శైలమ్మ ఒంటిపై పుస్తెల తాడు, చెవి కమ్మలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**రూ.7 వేల కోసం:** శైలమ్మ చిన్న కూతురి కొడుకు, ఆమె చిన్న మనవడు సాయికుమార్ అలియాస్ విశాల్‌పై బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. విశాల్ తరచూ అమ్మమ్మ వద్దకు వచ్చి డబ్బులు అడిగేవాడు. ఈ నెల 18న కూడా బైక్ కొనుక్కోవడానికి డబ్బులు కావాలని అడిగాడు. తన వద్ద కేవలం రూ.7,000 మాత్రమే ఉన్నాయని, అంతకు మించి ఇచ్చేది లేదని శైలమ్మ తేల్చి చెప్పింది.

**కల్లులో మత్తుమందు కలిపి:** డబ్బులు ఇవ్వకపోవడంతో విశాల్ తన స్నేహితుడితో కలిసి పథకం పన్నాడు. కల్లులో మత్తుమందు కలిపి శైలమ్మ చేత తాగించారు. ఆమె స్పృహతప్పిన తర్వాత బీరువాలో ఉన్న బంగారం తీసుకునేందుకు ప్రయత్నించారు.

**మేల్కొనడంతో హత్య:** ఈ క్రమంలో శైలమ్మకు మెలుకువ రావడంతో గట్టిగా కేకలు వేసింది. దీంతో విశాల్ ఆమె గొంతు నులిమి, స్నేహితుడు కాళ్లు గట్టిగా పట్టుకుని ఊపిరాడకుండా చేశారు. శైలమ్మ చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత ఒంటిపై, బీరువాలో ఉన్న బంగారం తీసుకుని పరారయ్యారు.

**నిందితుల అరెస్ట్:** బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో హత్య చేసింది నిజమేనని నిందితులు అంగీకరించారు. ప్రధాన నిందితుడు విశాల్, అతని స్నేహితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. బంగారం, డబ్బు కోసం రక్తసంబంధాన్ని కూడా చూడకుండా హత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

**అమ్మమ్మను చంపి బంగారం దోచేసిన మనవడు**
రామాయంపేటలో బైక్ కోసం రూ.7 వేలు ఇవ్వలేదని అమ్మమ్మ శైలమ్మకు మత్తు కల్లు తాగించి గొంతు నులిమి చంపిన మనవడు విశాల్. స్నేహితుడి సాయంతో బంగారం దోపిడీ. మూడో రోజు కర్మలో బంగారం లేకపోవడంతో బయటపడ్డ హత్య. ఇద్దరు నిందితుల అరెస్ట్

రామాయంపేటలో దారుణం: అమ్మమ్మను చంపిన మనవడు। బైక్ కోసం రూ.7వేలు ఇవ్వలేదని కల్లులో మత్తుమందు కలిపి హత్య। బంగారం దోచుకెళ్లిన వైనం। నిందితులు అరెస్ట్

# రామయంపేట మున్సిపాలిటీ వార్డు సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన



**రామాయంపేట జూన్ 23 మహాప్రభ**
రామాయంపేట మున్సిపాలిటీలో వార్డు సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన ఈరోజు ఉదయం రామయంపేట మున్సిపల్ కమిషనర్ ఏ. రవీందర్ గారు మరియు కౌన్సిలర్ బి . స్వప్న గారు తమ వార్డుల పర్యటిస్తూ ప్రజా సమస్యల ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. , ఈ సందర్భంగా పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిపాల సమస్యలపై గల్లి గల్లి తిరుగుతూ ప్రజల నుంచి వివరాలు సేకరించారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అధికారులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా విత్తన మేళా కార్యక్రమం



**దేవరకొండ జూన్ 23( మహాప్రభ )**
కొండమల్లేపల్లి పి. ఎ.సి.ఎస్. ఆధ్వర్యంలో మండలంలోని పెండ్లిపాకుల గ్రామ రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్. ఛైర్మన్ డా. దుడిపాల వేణుధర్ రెడ్డిముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పి. ఎ.సి.ఎస్.ఆధ్వర్యంలో రైతు వేదికల ద్వారా నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. రైతులు దళారుల మోసాలకు గురికాకుండా ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్ , అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ , అగ్రికల్చర్ ఎఇఓ , గుడితండా రైతులు, పరిసర ప్రాంతాల సర్పంచ్‌లు మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

# శివంపేటలో బాల్య వివాహానికి అడ్డుకట్ట..

### -నర్సాపూర్ కోర్టు నిషేధాజ్ఞలు



**మెదక్ జిల్లా - జూన్ 23 ( మహాప్రభ )**
శివంపేట మండల పరిధిలో జరగనున్న బాల్య వివాహాన్ని అడ్డుకునేందుకు నర్సాపూర్ గౌరవ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 ప్రకారం మైనర్ బాలిక వివాహం జరగకుండా నిషేధాజ్ఞ ఉత్తర్వులు జారీ చేసినట్లు మెదక్ బాలల సంక్షేమ న్యాయ సలహాదారు బాలనర్సింహులు తెలిపారు.బాల్య వివాహాల నిషేధ అధికారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, బాల్య వివాహం జరిగే అవకాశం ఉందని నిర్ధారించి ఈ ఉత్తర్వులు ఇచ్చింది. మైనర్ బాలిక తల్లిదండ్రులు, కాబోయే వరుడు, అతని తల్లిదండ్రులు వివాహం నిర్వహించడం లేదా పాల్గొనకుండా కోర్టు ఆదేశించింది.ఈ నిషేధాజ్ఞలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది.బాలల హక్కుల పరిరక్షణలో, బాల్య వివాహాల నిర్మూలనలో ఈ ఉత్తర్వులు కీలకమైన చర్యగా బాలనర్సింహులు పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, భద్రతతో కూడిన బాల్యం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.బాల్య వివాహాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కమిటీ, బాల్య వివాహాల నిషేధ అధికారిని సంప్రదించాలని కోరారు.

# చేనేత కుటుంబానికి రూ.40,500 ఆర్థిక సాయం



**హైదరాబాద్, జూన్ 23( మహాప్రభ )**
హైదరాబాద్ జిల్లా పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు వర్కాల ఉపేందర్ కుటుంబానికి రూ.40,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఉపేందర్ మరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాన్ని ఆదుకునేందుకు ఈ మొత్తాన్ని ఆయన చిన్న కుమార్తె శ్రీజ పేరుపై ఫిక్సడ్ డిపాజిట్‌గా జమ చేశారు ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నర్సింగరావు మాట్లాడుతూ.. చేనేత కార్మికుల దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. చేనేతకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని, ప్రజలు వారానికి కనీసం ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం పదాధికారులు మాటేటి జనార్దన్, పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాసబత్తిని రాజేశం,సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### -ఒకరికి తీవ్ర గాయాలు



**రామాయంపేట జూన్ 23 మహాప్రభ**
బికనూర్ మండలం బసవపూర్ గ్రామ శివారులో 44 సాయంత్రం చోటుచేసుకుంది , వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రాల గ్రామానికి చెందిన గడిల శమయ్య మండల కేంద్రంలోని పని ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి వస్తుండగా జైక హోటల్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది ప్రమాదం జరిగిన వెంటనే దారిన వెళ్లేవారు 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి సమాచారం అందించారు వారు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో వారు జిఎంఆర్ సిబ్బంది కి సమాచారం అందించారు కాలు విరిగి రోడ్డుపై పడిపోయిన శ్యామా యాను చికిత్స నిమిత్తం అంబులెన్స్ ఎక్కించి కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి షిఫ్ట్ చేశారు

# అక్రమ ఇసుక డంపులు సీజ్



**కరీంనగర్,జూన్ 23 ( మహాప్రభ )**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.కొత్తపల్లి మండలంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో బావుపేట గ్రామ పరిధిలో నిల్వ ఉంచిన మూడు భారీ ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. వీటిలో మొత్తం 75 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను చట్టపరమైన చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను కూడా పోలీసులు పట్టుకున్నారు.సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలు, నిల్వలు, రవాణా చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. కమీషనరేట్ వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు మరియు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇండ్లపై స్థానికుల ఫిర్యాదు



**పెద్దపల్లి, జూన్ 23 ( మహాప్రభ )**
మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని రంగంపల్లి నివాసితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.11వ వార్డులో పూదరి లక్ష్మి--నర్సయ్య దంపతులకు మంజూరైన ఇందిరమ్మ గృహం నిర్మాణంలో సెట్‌బ్యాక్ లేకుండా తమ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. మున్సిపల్ అధికారులు విచారణ అనంతరం పనులు ఆపాలని ఆదేశించినప్పటికీ, రాజకీయ ఆశ్రయం ఉన్నదన్న ధీమాతో నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తమ స్థలంలో నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# రాజ్ పల్లి రైతు వేదికలో విత్తన మేళ.



**మెదక్ జిల్లా -23జూన్ (మహాప్రభ).**
రాజ్ పల్లి రైతు వేదికలో విత్తన మేళ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమములో ఎ డి ఎ లక్ష్మీ ప్రవీణ్ మాట్లాడుతూ రైతు వేదికలలో 23-06-2026 నుండి 30-06-2026 వరకు నిర్వహించే విత్తన మేళాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరియు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 7 రకాల సన్న ధాన్యం ఆర్ ఎన్ ఆర్ 15048, డబ్ల్యూ జి ఎల్ 44, ధీరు 5204, జై శ్రీరామ్, కె ఎన్ యం 1638, కె ఎన్ యం 7715 ఎచ్ యం టి సోనా రకాలకు మాత్రమే బోనస్ వస్తుంది అని తెలియజేశారు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఇట్టి కార్యక్రమములో ఎ ఇ ఓ లు ప్రశాంత్ , రాజశేఖర్ ,ప్రతిభ ,కిరణ్ , సర్పంచులు ప్రజాప్రతినిధులు, రైతులు విత్తన డీలర్లు పాల్గొన్నారు.

